ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
ఆదివారం 25 ఫిబ్రవరి 2024



హోటళ్లలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై చైతన్యం

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): హోటళ్లు, లాడ్జిలలో అసాంఘి క కార్యకలాపాల నియంత్రణకు బెంగళూరు నగర పోలీసులు, ఓయో సంస్థ సంయుక్తంగా చైతన్యం కలిగించనున్నారు. ఈ మేరకు ఓయో ఆధ్వర్యంలో భద్రతా వాతావరణం కల్పిస్తారు. తూర్పు విభాగం డీసీపీ డి. దేవరాజ్ అధ్వర్యంలో సమీక్ష జరిగింది. హోటళ్లలో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నివారిస్తామన్నారు. ఓయో సంస్థ ప్రతినిధి నితిన్ ఠాకూర్ మాట్లాడుతూ హోటళ్లలో అతిథులకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. ఎటువంటి అంశం పైనైనా పోలీసులకు వివరించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు.

రాజ్యాంగ రక్షణతోనే సామాన్యులకు మనుగడ

● వ్యతిరేక ప్రచారాలను తిప్పికొట్టండి ● అసమానతలను తొలగించడం ప్రభుత్వాల బాధ్యత ● ముఖ్యమంత్రి సిద్దరామయ్య



జాతీయ ఐక్యతా దినోత్సవం ప్రారంభంలో సీఎం సిద్దరామయ్య తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'రాజ్యాంగ రక్షణతోనే సామాన్యుల మనుగడ సాధ్యమని, మనమే రాజ్యాంగానికి యజమానులమని, వ్యతిరేకించేవారిని తరిమికొట్టాలి' అని అబ్రహాం లింకన్ అభిప్రాయపడ్డారని, అటువంటి రాజ్యాంగ రక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పిలుపునిచ్చారు. నగరంలోని ప్యాలెస్ మైదానంలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగం, జాతీయ ఐక్యత సమావేశాన్ని శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారాలు సాగుతున్నాయన్నారు. రాజ్యాంగం దళితుల అభ్యున్నతి కోసమేనని ఆరోపిస్తున్నారని తెలిపారు. స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం విషయంలో స్పష్టత ఉన్నందునే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజునుంచే ఇటువంటి ప్రచారం ఉందని, వీటిని ఎవరూ సహించరాదని తెలిపారు. రాజ్యాంగ రక్షణతోనే మన మనుగడ సాధ్యమని, లేదంటే ప్రమాదంలో చిక్కుకున్నట్లే అన్నారు. సామాజిక అసమానతను తొలగించడం ప్రతి ప్రభుత్వం బాధ్యత అన్నారు. దేశంలో అసమానతలు తొలగించాలని, కానీ మనం వైరుధ్య సమాజంవైపు అడుగులు వేస్తున్నామని తెలిపారు. సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగినప్పుడే రాజకీయ ప్రజాప్రభుత్వాలు విజయవంతమైనట్లు అన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంలో రాజ్యాంగ పీఠిక ఆశయాలను రాష్ట్ర ప్రజలకు అర్థం కలిగించేలా జనవరి 26నుంచి చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 31 జిల్లాల్లోనూ సభలు, సమావేశాలు కొనసాగుతున్నాయన్నారు. ఇందులో భాగంగానే రెండు రోజుల జాతీయ ఐక్యతా సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని చదవాలని, అంబేడ్కర్ రాజ్యాంగ రచనా సమితి అధ్యక్షుడిగా అనేక దేశాల రాజ్యాంగాలను చదివి అర్థం చేసుకుని మన దేశానికి అనుగుణంగా రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. రాజ్యాంగ చైతన్య కార్యక్రమాల్లో ఉత్తమంగా నిర్వహించిన తుమకూరు, దావణగెరె, మైసూరు, కొడగు, బళ్లారి జిల్లాలకు జ్ఞాపికలను ప్రదానం చేశారు. సభలో పరిషత్ సభాపతి బసవరాజ్ హొరట్టి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాలగౌడ, హైకోర్టు మాజీ న్యాయమూర్తి నాగమోహన్ దాస్, మంత్రి ప్రియాంక ఖర్గే, ఎమ్మెల్యే సోమశేఖర్, అదనపు ముఖ్యకార్యదర్శి శాలిని రజనీశ్ తదితరులు ఉన్నారు.



సభలో పాల్గొన్న ప్రజలు, తదితరులు

ఘనంగా శ్రీవారి బ్రహ్మ రథోత్సవం



స్వామివారికి విశేష అలంకరణ

దొడ్డబళ్లాపుర, ఫిబ్రవరి 24: తాలూకా కేంద్రమైన దొడ్డబళ్లాపురలో ప్రసిద్ధి చెందిన ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మరథోత్సవం శనివారం ఘనంగా జరిగింది. మాఘ మాస పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చారు. ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు, జేడీఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బి. మునేగౌడ, మాజీ ఎమ్మెల్యే వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు. స్థానికులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు బ్రహ్మరథోత్సవానికి తరలి వచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నసంతర్పణ నిర్వహించారు.



పురవీధులలో రథోత్సవం

మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం

● కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి



బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి తెలిపారు. హుబ్బళ్లిలోని బీవీబీ కళాశాలలో వీరశైవలింగాయత గ్లోబల్ బిజినెస్ కాంక్లేవ్ 2024ను శనివారం ప్రారంభించి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం రానున్న ఐదేళ్లలో దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.100 లక్షలకోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో ఉందన్నారు. రానున్న రోజుల్లో మూడోస్థానానికి, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా సాధ్యం కానుందని ఆకాంక్షించారు. వీరశైవలింగాయతులు ఉద్యోగ సృష్టికర్తలని, కర్ణాటకకే పరిమితం కాకుండా దేశ విదేశాల్లోనూ రాణిస్తున్నారని కొనియాడారు. విశ్వవ్యాప్తంగా వీరశైవలింగాయతులు ఉన్నత హోదాల్లో ఉన్నారని, వ్యాపార పారిశ్రామికంగా అభివృద్ధి చెందారని పేర్కొన్నారు. బసవణ్ణ కాలం నుంచి సమాజం ప్రభావితం చేస్తోందన్నారు. మహిళలకు హక్కులు కల్పించిన ఘనత బసవణ్ణ అనుభవమండపం ద్వారానే ప్రారంభమైందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవకు వీరశైవలింగాయతలంతా ఆదరిస్తున్నారన్నారు. మన ప్రజాప్రభుత్వాన్ని ప్రపంచమే కొనియాడుతోందని, ఇదే కారణంతోనే లండన్‌లోనూ బసవణ్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. కేఎల్ఈ విద్యాసంస్థల కార్యాధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్ కోరె మాట్లాడుతూ వ్యవసాయం, వ్యాపార రంగాలలో వీరశైవ సామాజికవర్గం ఎన్నో సాధనలు చేసిందన్నారు. కేఎల్ఈ డైరెక్టర్ శంకరణ్ణ మనవళ్లి, రిజిస్ట్రార్ అశోక్ శెట్టర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. మూడు రోజులపాటు సదస్సు కొనసాగనుండగా వస్తు ప్రదర్శనశాలను ప్రముఖులు ప్రారంభించారు.

అబద్ధాల ఫ్యాక్టరీ బీజేపీ

● అభివృద్ధితోనే మా సమాధానం ● అరసికెరె సభలో సీఎం సిద్దరామయ్య



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య


బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అబద్ధాల ఫ్యాక్టరీ బీజేపీకి అభివృద్ధితోనే సమాధానం చెబుతామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య వెల్లడించారు. హాసన్ జిల్లా అరసికెరెతోపాటు ధారవాడ జిల్లా నవలగుంద పరిధిలో పలు కార్యక్రమాల్లో సీఎం శనివారం పాల్గొన్నారు. అరసికెరె సభలో సీఎం మాట్లాడుతూ తమ గ్యారెంటీలను లబ్ధిదారులను నిరంతరంగా బీజేపీ అవమానిస్తోందన్నారు. కానీ ఇవే గ్యారెంటీలను కాపీ చేసి మోదీ గ్యారెంటీ అంటూ వివిధ రాష్ట్రాల్లో అమలు చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. రాష్ట్రాన్ని మోసం చేసిన బీజేపీ వైపు ఉంటారా...? అన్ని వర్గాలకు గ్యారెంటీల పేరిట సంక్షేమాలు సమకూరుస్తున్నా మావైపు ఉంటారా..? అనేది నిర్ణయించుకోవాలన్నారు. వచ్చే జన్మలో ముస్లింగా పుడతానని చెప్పుకున్న దేవెగౌడ, బీజేపీతో చేతులు కలిపారన్నారు. సంయుక్తంగా విధానపరిషత్‌కు ఒకే అభ్యర్థిని రంగంలోకి దించినా కాంగ్రెస్ అభ్యర్థి పుట్టణ్ణ గెలుపు సునాయాసమైందన్నారు. అధికారంలోకి వచ్చిన క్షణం నుంచే ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కట్టుబడ్డామన్నారు. 8 నెలల్లో ఐదు హామీలను పూర్తి చేశామన్నారు. గ్యారెంటీల కోసం ఏడాదికి రూ.60వేల కోట్లను నెలవారీ సామాన్యుల జేబులకు ఇస్తున్నామన్నారు. ఎమ్మెల్యే శివలింగేగౌడ అభివృద్ధికోసం కట్టుబడ్డారని అందుకే నిరంతరంగా గెలుస్తున్నారన్నారు. కొన్నేళ్లుగా ఆయన సేవలు తమకు తెలుసునన్నారు. ఎత్తినహొళె కోసం నిరంతరంగా పోరాటం చేశారని, మేమే భూమిపుత్రులమని చెప్పుకొనేవారు ఎందుకు అమలు చేయలేదన్నారు. భద్ర ఎగువ ప్రాజెక్టుకు కేంద్రం రూ.5,300 కోట్లు ప్రకటించి ఏడాది ముగిసినా పైసా విడుదల కాలేదన్నారు. బాణవారలో కనక భవన్‌ను ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలో రూ.152 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రాజణ్ణ, విద్యుత్‌శాఖ మంత్రి కేజే జార్జ్, కడూరు ఎమ్మెల్యే ఆనంద్‌తోపాటు ముఖ్యులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న వార్డు ప్రజలు

తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన

రాయచూరు, ఫిబ్రవరి 24 : జిల్లాలోని సిరవార పట్టణం రెండో వార్డులో తాగునీటి సమస్య తీవ్రతరమవుతున్నా అధికారులు స్పందించడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరును నిరసిస్తూ వార్డు ప్రజలు శనివారం ఖాళీ బిందెలతో ఆందోళన నిర్వహించారు. నీటిపారుదల శాఖ కార్యాలయం నుంచి పట్టణ పంచాయతీ కార్యాలయం వరకు ఖాళీ బిందెలతో ప్రదర్శన నిర్వహించిన కాలనీ వాసులు కార్యాలయం ముందు బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ పంచాయతీ ముఖ్య అధికారి తిమ్మప్ప ఆందోళనకారుల వద్దకు వచ్చి కొత్త బోర్‌వెల్ ఏర్పాటు చేసి వార్డులో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆలోగా తక్షణ అవసరంగా ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి కాలనీలో ఇంటింటికి తాగునీరందిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



నామమాత్రంగా పాఠకులు

పాఠకులు లేక సెంట్రల్ లైబ్రరీ వెలవెల

● అందుబాటులో 6 లక్షల పుస్తకాలు ● భారీగా తగ్గిన సందర్శకులు

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా విశ్వవిద్యాలయంగా పేరొందిన రాష్ట్ర సెంట్రల్ లైబ్రరీ పాఠకులు లేక వెలవెలబోతోంది. లక్షలాది పుస్తకాలు ఉన్నా గంటలతరబడి గడుపుతూ కోరుకున్న పుస్తకాన్ని పఠించేవారు లేని పరిస్థితి కొనసాగుతోంది. 109 ఏళ్ల చరిత్ర కలిగిన సెంట్రల్ లైబ్రరీ ద్వారా జ్ఞానార్జన పొంది ఎంతోమంది ఉన్నత స్థాయికి ఎదిగారు. పీహెచ్‌డీలు, పరిశోధనలు చేసేవారు, పుస్తకాలు కొనుగోలు చేసే శక్తిలేనివారు గ్రంథాలయాన్ని ఆశ్రయించేవారు. ఇదంతా వందేళ్లుగా సాగుతున్న ప్రక్రియ. కానీ ఇటీవల కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్లు వచ్చాక యువతలో పుస్తకపఠనం పట్ల అభిరుచి తగ్గిపోయింది. కబ్బన్‌పార్క్ ఆహ్లాదకర వాతావరణంలో సెంట్రల్ లైబ్రరీ పుస్తక ప్రియుల కోసం ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది.

1915లో ప్రారంభం

1913 నవంబరు 20 వైస్రాయ్ లార్డ్ హార్డి కబ్బన్‌పార్క్ ప్రాంగణంలో శేషాద్రి అయ్యర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. 1914లో స్మారక సమితి ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా ఓ గ్రంథాలయం ఆవశ్యకత ఉందని నిర్మాణాలు ప్రారంభించారు. మైసూరు దివాన్ సర్ ఎం. విశ్వేశ్వరయ్య భవనాన్ని రాష్ట్ర ప్రజా గ్రంథాలయ విభాగానికి అప్పగించారు. ఇలా 1915 మే 1న గ్రంథాలయం ప్రారంభమైంది. విరాళాల ద్వారా సేకరించిన రూ.లక్షతో నిర్మాణాలు చేపట్టారు. సాధారణ సభ్యత్వానికి రుసుం వసూలు చేసేవారు. 1920లో గ్రంథాలయాన్ని ప్రభుత్వానికి అప్పగించారు. 1943లో గ్రంథాలయాన్ని విస్తృతం చేశాక 4,750 పుస్తకాలు ఉండేవి. 215 మంది సభ్యులు ఉండేవారు. ప్రభుత్వ, స్థానిక సంస్థలతోపాటు విభిన్న వర్గాల ముఖ్యులు మిలిటరీ కేంద్రాల్లో పనిచేసేవారు గ్రంథాలయానికి వచ్చేందుకు ఆసక్తి చూపేవారు. కర్ణాటక ప్రజా గ్రంథాలయం 1965 నిబంధన అమలులోకి రావడంతో 1966లో గ్రంథాలయాన్ని స్వాధీనం చేసుకుంది. స్టేట్ సెంట్రల్ లైబ్రరీగా పేరు పెట్టారు.

ఒకప్పుడు నిత్యం వేలల్లో సందర్శకులు


కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్లు వంటి సౌలభ్యాలు లేని కాలంలో నిత్యం వేలాదిమంది సందర్శకులు వచ్చేవారు. కబ్బన్‌పార్క్ నగర నడిబొడ్డున ఉండడం, సమీప ప్రాంతాల్లో ప్రతిష్ఠాత్మకమైన ఉన్నత విద్యాసంస్థలు, యూనివర్సిటీలు అందుబాటులో ఉండడంతో పుస్తక జ్ఞానం కోసం పరితపించేవారు. కొందరు ఉదయం నుంచి రాత్రి దాకా గ్రంథాలయంలోనే గడిపి చదువుకునేవారని తెలుస్తోంది. స్మార్ట్ ఫోన్ల ప్రభావంతో పుస్తక పఠనం ఆలోచన రానురాను తగ్గిపోయింది. ఈ ప్రభావం గ్రంథాలయంపై పడింది. యూరోపియన్ శైలిలో గ్రంథాలయాన్ని నిర్మించారు. మైసూరు దివాన్, ప్రముఖ చరిత్రకారుడు సర్ శేషాద్రి అయ్యర్ ఈ భవనంలో ఉండేవారు. ఆయన జ్ఞాపకార్థమే భవనాన్ని ఆధునీకరించి యూరోపియన్ శైలిలో మార్పు చేశారు. కాగా మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా పలు పుస్తకాలను డిజిటలీకరణతోపాటు కంప్యూటర్ వ్యవస్థ కూడా కల్పించారు. అయితే పుస్తక పఠనం చేసేవారి సంఖ్య గతంతో పోలిస్తే తగ్గుముఖం పట్టింది

6 లక్షల పుస్తకాలు

సెంట్రల్ లైబ్రరీలో 3,74,011 రెఫరెన్స్ పుస్తకాలు, 2,27,257 కాపీ రైట్ పుస్తకాలు, 694 బ్రెయిలీ పుస్తకాలు ఉన్నాయి. 296 వార, పక్ష పత్రికలతోపాటు అన్ని భాషల దినపత్రికలు అందుబాటులో ఉంటాయి. గ్రంథాలయం ప్రస్తుతం 300 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగి ఉంది. అంతస్థుల తరహాలో దేశంలోని అన్ని భాషలు, పలు విదేశీ భాషల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి సోమవారం, రెండో మంగళవారం, ప్రభుత్వ సెలవు దినాలు మినహా మిగిలిన అన్ని రోజులు ఉదయం 9.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు కొనసాగుతుంది.



కబ్బన్‌పార్క్‌లోని స్టేట్ సెంట్రల్ లైబ్రరీ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.35	1,607.18
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	763	9,958
సామర్థ్యం (టీఎంసీలు)	8.96	32.35

ఘనంగా కార్గిల్ విజయోత్సవం



కార్గిల్ విజయోత్సవాన్ని జరుపుకుంటున్న మాజీ యోధులు

గంగావతి, ఫిబ్రవరి 24: గంగావతిలోని మాజీ ఎంపీ హెచ్‌జీ శ్రీరాములు నివాసంలో శనివారం 25వ కార్గిల్ విజయోత్సవాన్ని సిటిజన్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుపుకున్నారు. మాజీ ఎంపీ శ్రీరాములు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో ఎంతో మంది మిలిటరీ వీరులను పోగొట్టుకున్నామన్నారు. భారతదేశ రక్షణకు ప్రతి ఒక్క భారతీయుడు మిలిటరీ వీరుడుగా మారాలన్నారు. ఈసందర్భంగా ఎబ్బాళమఠం స్వామి నాగభూషణ ఆచారి, మాజీ ఎమ్మెల్యే మురళీధర్, మంత్రి మల్లికార్జున నాగప్ప, మిలిటరీ మాజీ యోధులు, విరూపాక్షప్ప, కాళప్ప, రమేశ్, సురేశ్, ఉస్మాన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల నటీనటులకు అనుమతి తప్పనిసరి



కలెక్టర్ ప్రశాంత్ కుమార్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 24: పిల్లలు బాల నటీనటులుగా, నటించాలంటే వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని బాలకార్మిక పథకం ఛైర్మన్, జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. రాష్ట్రంలో చైల్డ్ అండ్ కౌమార లేబర్ చట్టం 1986, సవరణ చట్టం 2016ప్రకారం, 14సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న పిల్లలు బాల నటులుగా నటించడాన్ని చట్టం పూర్తిగా నిషేధిస్తుందన్నారు. బాలల విద్యా హక్కుకు హాని కలగకుండా ఉండేందుకు, బాలకార్మికుల చట్టం ప్రకారం ప్రమాదకర పరిశ్రమల్లో మైనర్లను పనిలో పెట్టుకోకుండా పూర్తిగా నిషేధించామని ఆయన ప్రకటనలో తెలిపారు. పిల్లలను పనిలో పెట్టుకున్న నేరానికి యజమానికి రూ.20వేల నుంచి 50వేల వరకు జరిమానాతోపాటు 6నెలల నుండి 2సంవత్సరాల వరకు జైలు శిక్ష విధిస్తారన్నారు. ఏపిల్ల వాడి చేతనైనా ఒక రోజులో 5గంటల కంటే ఎక్కువ సేపు నటింపచేయకూడదన్నారు. విశ్రాంతి లేకుండా 3గంటల కంటే ఎక్కువ సేపు పని చేయించుకోకూడదన్నారు.

ఆదర్శవిద్యాలయంలో సరస్వతీ పూజ



పూజ చేస్తున్న విద్యార్థులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 24: ప్రభుత్వ ఆదర్శ విద్యాలయంలో పదవతరగతి విద్యార్థులకు శనివారం సరస్వతీ పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విజయనగరం జిల్లా అక్షర దాసోహ విద్యాశాఖాధికారి అంజనేయ, పాఠశాల ఎస్‌టీఎంసీ అధ్యక్షులు రమణప్ప భజంత్రీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమార్, వారితో ఉపాధ్యాయులు సరస్వతీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెళగల్లు వీరణ్ణ తోలుబొమ్మలాట ప్రదర్శించారు. క్షీణించి పోతున్న ఈకళకు మరల విద్యార్థులు జీవం పోసారన్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా 10వ తరగతిలో విద్యార్థులు 600మార్కులకు పైగా ఫలితాలు సాధించాలన్నారు. తదనంతరం పాఠశాల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

38 మందికి కంటి చికిత్స

కంప్లి, ఫిబ్రవరి 24 : హంపి సమీపంలోని కడ్డిరాంపురం గ్రామంలో అశ్విని నేత్రాలయం వారి ఆధ్వర్యంలో శనివారం కంటి చికిత్స శిబిరం నిర్వహించారు. సుమారు 38 మందికి డాక్టర్ శ్రీనివాస్ దేశ్‌పాండే చికిత్స చేశారు. గతంలో కంటి సమస్యలతో ఎందరో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గ్రామస్తుడు ప్రశాంత్ తమకు దృష్టికి తీసుకురావడంతో తాము ఇక్కడ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వైద్యులు తెలిపారు. పేద కుటుంబాల ప్రజలు తమ ఆస్పత్రి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టువదలని కంప్లి భగీరథులు!

- నీరు లేక ఎండిపోతున్న రబీ వరి పంట
- నదిలోని గుంతల్లో నీటిని మళ్లించి పైరుకు జీవం పోస్తున్న రైతులు



గుంటల్లో నిలిచిన నీటిని మళ్లిస్తున్న ఎక్స్‌కవేటర్

కంప్లి, ఫిబ్రవరి 24 : చినుకు చినుకు కలిస్తేనే ప్రవాహమవుతుంది. అలా కాకుండా పోతే ఏ గుంట నీరు అక్కడే ఇంకిపోతుంది. ఈ సూత్రాన్ని అర్థం చేసుకున్న కంప్లి రైతులు తుంగభద్ర నదిలో మిగిలిన నీటిని ఒడిసిపట్టి పంటలకు మళ్లించుకుంటున్నారు. ఇటిగి, మారెమ్మ క్యాంపు, భక్తవత్సల క్యాంపు, నారాయణస్వామి క్యాంపు, సన్నాపురం రైతులు మొండిగా నదిలో కాస్తో కూస్తో నీరు వుండటంతో నమ్మకంతో రబీలో వరి నాట్లు వేశారు. కానీ ఎండల ప్రభావానికి నీరు పూర్తిగా ఇంకిపోవడంతో కష్టాలు ఎదురయ్యాయి. వేసుకున్న వరి పంట నీరులేక ఎండిపోతోంది. పొలాలన్నీ బీటలు పారాయి. ఈ నేపథ్యంలో ఏంచేయాలా అని ఆలోచించారు. రెండు మూడు రోజులుగా నదిలోని గుంతల్లో అక్కడక్కడా నిలిచిన నీటిని బోర్ల వద్దకు మళ్లిస్తే పంటలను కాపాడుకోవచ్చని నిర్ణయించుకున్నారు. కంప్లి పరిధిలోని సన్నాపురం, ఇటిగి, ముద్దాపురం, మన్నూరుసూగూరు రైతన్నలు సమష్టిగా గత రెండు రోజులుగా ఎక్స్‌కవేటర్‌లతో నీటి గుంతల్లో వున్న నీటిని ఒక ప్రవాహంగా మార్చి మోటార్ల వద్దకు మళ్లించుకుంటున్నారు. అక్కడ నుంచి పంటలకు పారిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ యేడాది రబీలో తాము మొండిగా నాట్లు వేసుకుని నష్టపోయామని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్స్‌కవేటర్లకు గంటకు రూ. వెయ్యి నుంచి రూ.1200 బాడుగ చెల్లించి నీటిని మళ్లిస్తున్నామని తెలిపారు. ఖరీఫ్ కొంతవరకు సంతోషం మిగిల్చినా రబీలో మాత్రం కష్టాలు ఎదురయ్యాయని తమ ఆవేదనను వ్యక్తంచేస్తున్నారు. అయినా తమ ప్రయత్నం మానమని, పంటలను బ్రతికించుకు తీరుతామని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.



ఇటిగి వద్ద నీరు లేక నెర్రెలు చీలిన వరి మడి

కాలువల సంరక్షణపై అలరించిన వీధినాటకం



కాలువల రక్షణపై ప్రదర్శిస్తున్న వీధి నాటకం

కంప్లి, ఫిబ్రవరి 24 : ఆధునీకరణ చేపట్టిన కాలువలను రక్షించుకోవాలనే సందేశంతో కేఎన్‌ఎన్ఎల్ శాఖ ఆధ్వర్యంలో రామసాగరంలో నాటకం ప్రదర్శన చేపట్టారు. చివరి ఆయకట్టు రైతులను దృష్టిలో వుంచుకుని ప్రభుత్వాలు కాలువలకు మరమ్మతులు చేయించి అందరికీ నీరందేలా చర్యలు తీసుకుంటున్నా కొందరు వాటిని ధ్వంసం చేస్తూ ఎక్కడపడితే అక్కడ కాలువను ధ్వంసం చేస్తూ నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. ప్రతి ఒక్క రైతన్న ముందుకొచ్చి తమ కాలువలను తామే రక్షించుకుని అందరికీ నీరందేలా సహకరించుకోవాలని కేఎన్ఎన్ఎల్ అధికారి మంజుళ, రాజేశ్వరిలు తెలిపారు. వారితో పాటు అధికారులు నీటి పారుదల సంఘాల ప్రతినిధులు దేవన్న గౌడ, గోవిందు, కుమార్, ఆర్ఎఫ్ రుద్రప్ప, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 5కోట్లతో సంచారజాతుల భవన్

మంత్రి నాగేంద్ర హామీ



అంబేద్కర్‌కు నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాగేంద్ర

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 24: జిల్లాలో సంచార జాతులకు రూ.5 కోట్లవ్యయంతో భవనాన్నినిర్మిస్తున్నట్లు మంత్రి నాగేంద్ర తెలిపారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంచార జాతుల మహాసభ ఆధ్వర్యంలో నగరంలోని వాల్మీకి భవన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి అవగాహన సదస్సును ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఒక ఎకరం ప్రభుత్వ స్థలంలో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. సంచార, అర్ధసంచార జాతులను గుర్తించి ప్రభుత్వ భూమి ఎక్కడ ఉంటే అక్కడ భూమిని అందజేస్తామన్నారు. ఇల్లు నిర్మించుకోలేని వారికి ఇళ్ళుకట్టిస్తామన్నారు. రాజ్యాంగంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కోరిక మేరకు ప్రభుత్వం సంచార జాతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. సిటీ ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి మాట్లాడుతూ, ఎలాంటి పరిస్థితుల్లోనైనా వారి వెంటే ఉంటానని, వారి సాధికారత కోసం కృషి చేస్తానని చెప్పారు. అలాగే సంచార వారసత్వాన్ని కొనసాగించడం అందరి కర్తవ్యమన్నారు. కంప్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గణేశ్ మాట్లాడుతూ సంచార జాతులకు అండగా ఉంటానన్నారు. మాజీఎంపి ఉగ్రప్ప మాట్లాడుతూ సంచార జాతులు ఒకప్పటిలా ఉండడంలేదన్నారు. వాళ్ల కూడా సెటిల్ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. సంచార జాతులకు అవసరమైన సహకారం అందజేస్తామన్నారు. కర్నాటక ఎస్సీ, ఎస్టీ, సంచార జాతుల బుడకట్టు మహాసభ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ సంచార జాతులు విద్యావంతులైఉండాలని, అందరం కలిసికట్టుగా పోరాడి ప్రభుత్వాల కళ్లు తెరిపించాలన్నారు. సంచార జాతులకు భూవసతి, ఉపాధిలో రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బళ్లారి మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ శ్వేతా సోము, కాంగ్రెస్ నేతలుకల్లుకంబ పంపాపతి, సంచార అర్ధసంచార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేషప్ప, కర్ణాటక రాష్ట్ర ఎస్సీఎస్టీ ,గిరిజన మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు వీరేశ్, సంచార సంఘాల నాయకులు రామాంజిని, గోవింద, వీరేశ్, సంచార సంఘాల నాయకులు, జంబునాథ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ!

కన్నుల పండువగా కోట మల్లేశ్వరస్వామి రథోత్సవం



కోట మల్లేశ్వరస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 24 : బళ్లారి కోట ప్రాంతంలో వెలసిన కోట మల్లేశ్వర స్వామి మహారథోత్సవాన్ని కన్నుల పండువగా జరుపుకున్నారు. శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో కారు వీధిలో మడితేరును బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి లాగారు. సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవాన్ని వేలాది మంది భక్తుల సమక్షంలో మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. కారు వీధి నుంచి నీలకంఠేశ్వర దేవస్థానం వరకు భక్తులు రథాన్ని లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఈ రథోత్సవంలో కోలాటం నృత్యాలు, భజన తదితర సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించినట్లు ఈవో హనుమంతప్ప తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుండి భక్తాదులు పెద్దఎత్తున తరలిరావడంతో జాతర సందడి నెలకొంది. భక్తులు రథంపైకి పూలు, పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు కోటలో వెలసిన మల్లేశ్వరస్వామికి అలంకరణ నిర్వహించిన సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో బళ్లారి ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, సిటీ ఎమ్మెల్యే భరత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి, కేఆర్‌పీపీ పార్టీ నాయకురాలు లక్ష్మీ అరుణ, పలువురు కార్పొరేటర్లు, వార్డు సభ్యులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

సిరగేరి ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయాలి



డీహెచ్‌ఓ రమేశ్‌బాబుకు వినతి పత్రం సమర్పిస్తున్నసిరిగేరి గ్రామస్థులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 24: సిరుగుప్ప తాలూకాలోని సిరిగేరి ప్రభుత్వ ఆసుపత్రిని కమ్యూనిటీ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని గ్రామ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌బాబుకు వారు శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా సిరగేరి గ్రామ పంచాయితీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులు మాట్లాడుతూ, సిరిగేరి గ్రామంలో 18 వేలకు పైగా జనాభా ఉన్నారని, అలాగే చుట్టుప్రక్కల ఇరవైకి పైగా గ్రామాలకు చెందిన 30వేల మంది కూడా సిరిగేరి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వస్తారన్నారు. అయితే పెద్ద రోగాలు, అత్యవసర చికిత్సలు, ప్రసవం, పాము, తేలు కాటు, తదితర వాటి చికిత్స కోసం సిరుగుప్ప, బళ్లారి విమ్స్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ఆసుపత్రికి రోజు వందమందికి పైగా చికిత్స కోసం వస్తున్నారని, వీరిని పరీక్షించి చికిత్స చేసేందుకు సరిపడా సిబ్బంది లేరని, అలాగే మందులు కూడా లేకపోవడంతో సరైన వైద్యం అందడం లేదన్నారు. అంబులెన్స్‌కు ఫోన్ చేసి బళ్లారికి తరలించాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి ఆసుపత్రిని అప్‌గ్రేడ్‌చేసి, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీనిపై డీహెచ్‌ఓ స్పందించి వెంటనే అదనపు స్టాఫ్ నర్సులను, మరో వైద్యాధికారిని నియమిస్తామన్నారు.

ఎమ్మిగనూరు వామదేవ శివాచార్యులకు తులాభారం



శివాచార్యులకు తులాభారం చేపట్టిన ఎమ్మెల్యే గణేష్, గాలి లక్ష్మీఅరుణ

కంప్లి, ఫిబ్రవరి 24 : కంప్లి తాలుకాలోని ఎమ్మిగనూరు గ్రామానికి చెందిన వామదేవ శివాచార్యులకు కేఆర్‌పీ పార్టీ నాయకులు గాలి అరుణ లక్ష్మీ, ఎమ్మెల్యే జేఎన్ గణేష్ ఆధ్వర్యంలో తులాభారం చేపట్టారు. వీరు బ్రహ్మజ్ఞాని నెట్రవర్తి బసప్ప తాత 52వ పుణ్యారాధన సందర్భంగా భక్తులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని వామదేవ శివాచార్యులకు తులాభారం చేపట్టారు. ఈ సందర్భంగా అరుణ లక్ష్మీ మాట్లాడుతూ ఇలాంటి ధార్మిక కార్యక్రమాలకు పార్టీలకు అతీతంగా అందరూ ముందుకు రావాలన్నారు. అప్పుడే గ్రామంలో శాంతిభద్రతలు నెలకొంటాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ కంప్లి నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనైనా ధార్మిక కార్యక్రమాలను కులమత బేధాలు లేకుండా అందరూ కలసిమెలసి జరుపుకుంటారని తెలిపారు. వామదేవ శివాచార్యులు మాట్లాడుతూ ప్రతి యేటా నెట్రవర్తి బసప్ప తాత వర్ధంతిని ఒక పండుగలా జరుపుకుంటారన్నారు. ఎమ్మిగనూరుతో పాటు జిల్లాలో పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని ఆయనకు మొక్కులు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో దమ్మూరు శేఖర్, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధమ్మ దేవి రథోత్సవం



గాంధమ్మ దేవి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

సిరుగుప్ప, ఫిబ్రవరి 24 : అంగరంగ వైభవంగా గాంధమ్మదేవి మహారథోత్సవం శనివారం జరిగింది. సిరుగుప్ప తాలుకా దేశనూరు మార్గంలో తుంగభద్ర నదితీరాన వెలసిన గాంధమ్మ దేవి రథోత్సవం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని జరపడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం మేళతాళాలు, డోలు డమరులతో వేలాది మంది భక్తులు గాంధమ్మ దేవి రథాన్ని లాగారు. ఈ సందర్భంగా భక్తులు రథంపై పూలు, పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవం సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

రేపటి నుంచి నెల్లూడి మైలారలింగేశ్వర జాతర మహోత్సవాలు

కంప్లి, ఫిబ్రవరి 24 : విజయనగర జిల్లా హువిన అడగళి తాలుకాలో ప్రసిద్ధి చెందిన మైలార లింగేశ్వరస్వామి జాతర మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం ఇప్పటికే తాగునీరు, తదితర సౌకర్యాలను అధికారులు సిద్ధం చేశారు. జిల్లా అధికారి దివాకర్ మాట్లాడుతూ, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాతరను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ఇక్కడ గొరవయ్యలు చెప్పే భవిష్యవాణి కోసం లక్షలాది మంది ఈ ప్రాంతానికి చేరుకుంటున్నారు.

హోసూరు జోన్

రూ.31 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు ప్రారంభం



నీటి సరఫరా మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 24: సముద్రపునీటిని సాధారణ వినియోగానికి ఉపయోగపడేలా రూ.31కోట్లతో రోజుకు 150 ఎంఎల్‌డీ సామర్థ్యం కల్గిన డిశాలినేషన్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ శనివారం ప్రారంభించారు. అసంపూర్తిగా ఉన్న మరో 95 ప్రాజెక్టు పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ త్రాగునీటి సరపరా శాఖ తరపున కృష్ణగిరి జిల్లా వేపనపల్లి యూనియన్ పరిధిలోని ఎన్నెకోలు, 123 ఆవాసాల ఉమ్మడి తాగునీటి పథకాన్ని ఆయన వర్చువల్ రూపంలో ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను కలెక్టర్ సరయు పరిశీలించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ ఎంపీ ఎ.చెల్లకుమార్ అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యాలయంలో 1.80 లక్షల లీటర్ల సామర్థ్యంగల గ్రౌండ్ లెవల్ వాటర్ కనెక్షన్ ట్యాంకులకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఇలా సేకరించిన తాగునీటిని 5.75 లక్షల లీటర్లు సామర్థ్యం గల ఎన్నేకోలు గ్రౌండ్ లెవల్ వాటర్ హార్వేస్టింగ్ ట్యాంక్‌కు పంపింగ్ చేస్తారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ నాయకురాలు మణిమేగలై, నాగరాజ్, ఇంజనీర్ ఎ.జయకుమార్, హొగేనేకల్ జాయింట్ త్రాగునీటి సరఫరా ప్రాజెక్టు ఇంజనీర్ బాలసుబ్రహ్మణ్యం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీ లోకనాథన్, రఖోథ్‌సింగ్ రామదాస్, అసిస్టెంట్ హైడ్రాలజీస్ట్ రాధిక, అసిస్టెంట్ ఇంజనీర్ తమిళరసి తదితర అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

హోసూరు(సిప్‌కాట్) ఫిబ్రవరి 24 : హోసూరు సమీపంలోని మడివాళం పంచాయతీ యూనియన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హోసూరు జిల్లా విద్యాధికారి మునిరాజ్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని ప్రసంగిస్తూ మడివాళం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగానే ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రభుత్వం హోసూరు ప్రాంతంలో కొత్త ఉపాధ్యాయులను నియమిస్తున్నారని, అందులో ముగ్గురు ఉపాధ్యాయులు మడివాళం పాఠశాలకు రానున్నారన్నారు. ప్రతి పిల్లల ఎదుగుదలకు తల్లిదండ్రులు ఎంతో శ్రమిస్తుంటారని అదే విధంగా వారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు తమవంతు సహకారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే చక్కగా చదివి ఉన్నత హోదాలతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పాఠశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు హితవు పలికారు. నృత్యం, తాళం తపట్టు, పాశ్చాత్య నృత్యం తదితర అంశాలలో రాణించిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలో ఓ సన్నివేశం

బీజేపీ ఓటమితోనే ప్రజాస్వామ్యం: హిరేమఠ్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న సామాజిక వేత్త ఎస్ఆర్ హిరేమఠ్

రాయచూరు, ఫిబ్రవరి 24 : దేశంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించితేనే ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించుకోగలమని సామాజిక వేత్త, ఉద్యమకారుడు ఎస్ఆర్ హిరేమఠ్ పిలుపునిచ్చారు. ఇందుకు వచ్చే లోకసభ ఎన్నికల్లో ప్రజలు తమ చేతులో ఉన్న ఓటు ఆయుధాన్ని ఉపయోగించాలని పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చండీగఢ్ మేయర్ ఎన్నిక ఎన్నికల బాండ్‌లకు సంబంధించి ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలను ప్రజలముందుంచిందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులు కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యంగా నరేంద్ర మోదీ నాయకత్వానికి చెంపపెట్టువంటిదన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును కాలరాస్తూ చండీగఢ్ మేయర్ ఎన్నికలో బీజేపీ ప్రభుత్వం అనుసరించిన తీరు సిగ్గుచేటన్నారు. ఎన్నికల బాండ్ల పేరుతో పెద్ద ఎత్తున రాజకీయ అవినీతికి పాల్పడుతున్న బీజేపీకి వచ్చే లోకసభ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం నేర్పాలన్నారు.

గదార్‌లో తాగునీటి ఎద్దడి




తాగునీటి కోసం ఓ చిన్నారి ప్రయాస

రాయచూరు, ఫిబ్రవరి 24 : జిల్లాలోని దేవదుర్గ తాలూకా గదార్ గ్రామంలో వేసవి ఇంకా పూర్తిగా ప్రారంభం కాకమునుపే తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. గత నెల రోజులుగా గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొనగా ప్రస్తుతం గ్రామంలో సిద్ధరామేశ్వర జాతర జరుగుతున్న నేపథ్యంలో జాతర సంబరాలకు గ్రామానికి చెందిన ప్రజల బంధువులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఇది స్థానికులకు జటిలంగా మారింది. ఈ క్రమంలో ఏ ఇంటికా ఇంటివారు ప్రత్యేక త్రిచక్ర వాహనాలను ఏర్పాటు చేసుకుని దూర ప్రాంతంలో పొలాలకు నీరు సరఫరా చేసే పంప్‌సెట్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటుండడం శనివారం కనిపించింది. అధికారులు సమస్య తీవ్రతను గుర్తించి వేసవి రాకముందే తాగునీటి సరఫరాకు తగిన ఏర్పాట్లు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

మెహెర్‌బాబా (జయంతి)



భగవంతుడి అవతారంగా ప్రకటించుకున్న ప్రముఖ ఆధ్యాత్మిక గురువు మెహెర్ బాబా 1894 ఫిబ్రవరి 25న మహారాష్ట్ర రాష్ట్రం పూణెలో జన్మించారు. అసలు పేరు మెర్వన్ షెరియార్ ఇరానీ. 19 ఏళ్లకు ఆధ్యాత్మిక అన్వేషణలో భాగంగా ఐదుగురు గురువులను కలిశాడు. 1922లో ఆయనే ఒక సంప్రదాయాన్ని ప్రారంభించి 27ఏళ్ల వచ్చేసరికే శిష్యులను పొందారు. కేవలం చేతి సైగలతో, అక్షరాల పలకతోనే సంభాషించేవారు. కుష్ఠువ్యాధిగ్రస్తులకు, పేదలకు మానసిక వ్యాధులతో బాధపడేవారికి సేవలందించారు. ఆయన బోధనలు డిస్కోర్సెస్, గాడ్ స్పీక్స్ అనే పుస్తకాలలో పొందు పరచబడ్డాయి. 1969 జనవరి 31న కన్నుమూశారు. మెహరాబాద్‌లోని ఆయన సమాధి ప్రస్తుతం అంతర్జాతీయంగా పర్యాటకులను ఆకర్షిస్తోంది. అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా దేశాలలో సైతం ఆయనకు భక్తులు నేటికీ ఉండడం విశేషం.

కొనకళ్ల వెంకటరత్నం (జయంతి)



కొనకళ్ళ వెంకటరత్నం 1909 ఫిబ్రవరి 25న పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు గ్రామంలో జన్మించారు. పోలీసుశాఖలో పనిచేసి ఏలూరులో స్థిరపడ్డారు. గేయ రచయితగానే కాకుండా కథా రచయితగా పేరొందారు. ప్రతోళి, బంగారి మామ, పొద్దు తిరుగుడు పూలు వంటి గేయకృతులను రాశారు. బంగారుమామ పాటల రచయితగా సుప్రసిద్ధులు. ఆయన కథలు ఆంధ్ర పత్రిక, భారతి, ఆంధ్రప్రభ, తదితర పత్రికలలో ప్రచురితమయ్యాయి. 'మొక్కజొన్న తోటలో ముసిరిన చీకట్లలో..' పాట 1959లో విడుదలైన 'సిపాయి కూతురు' సినిమాలోనూ, తర్వాత 'అదృష్టవంతులు' లోనూ ఉపయోగించారు. 1971 జనవరి 9న కన్నుమూశారు.

మొక్కపాటి కృష్ణమూర్తి (జయంతి)



మొక్కపాటి కృష్ణమూర్తి 1910 ఫిబ్రవరి 25న పశ్చిమగోదావరి జిల్లా పెదపాడు ప్రాంతంలో జన్మించారు. చిత్రకారుడు, శిల్పి, రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈయన చిత్రాలు లినో కట్స్, ప్రకృతి దృశ్యాలు, పల్లెటూరి జీవనదృశ్యాలు, ప్రాచీన గాథలకు రూపకల్పన చేసినవిగా విభజించవచ్చు. ఈయన చిత్రకళ దాదాపు సాంప్రదాయక పద్ధతిలో సాగినా పాశ్చాత్య చిత్రకళా రీతులపై, సిద్ధాంతాలపై లోతైన అధ్యయనం చేసి వాటిలోని మార్పులను ధోరణులను వివరిస్తూ అనేక విలువైన వ్యాసాలు రచించి ప్రచురించారు. 1962 మే 6న కన్నుమూశారు.

తరగతి గదులకు భూమిపూజ

బాగేపల్లి, ఫిబ్రవరి 24: కళాశాల తరగతి గదులను సకాలంలో పూర్తి చేయాలని, నిర్మాణాలలో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని పీయూ కళాశాల విద్యార్థినులకు వీలుగా వివేక్ పథకం కింద సుమారు రూ.75 లక్షలతో మూడు తరగతి గదుల నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని గుడిబండ, బాగేపల్లి, పాతపాళ్య, చేళూరులలో కాలేజీ తరగతి గదుల నిర్మాణానికి రూ.3కోట్ల గ్రాంటు మంజూరైందన్నారు. ఇందులో తలా రూ.75లక్షలు కేటాయించి పట్టణంలో కళాశాల గదులు నిర్మించనున్నట్టు తెలిపారు. కాగా నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణాలు చేపట్టాలని నాసిరకంగా గుర్తిస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీఈఓ తనుజా, ప్రిన్సిపాల్ రూప పై, బ్లాక్ కాంగ్రెస్ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు బిబిజాన్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్ హనుమంతరెడ్డి, జడ్పీ మాజీ సభ్యుడు బూరుగుమడుగు నరసింహప్ప, కాంగ్రెస్ ముఖ్యులు శ్రీనివాసరెడ్డి, బీవీ వెంకటరమణ, గుంటిగానహళ్ళి మంజునాథరెడ్డి, నజరత్ బేగం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

చేళూరు, ఫిబ్రవరి 24: తాలూకా కేంద్రమైన చేళూరులోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో శనివారం ఏర్పాటైన కన్నడ, జానపద నృత్య కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే సుబ్బారెడ్డి పాల్గొన్నారు. తహసీల్దార్ ప్రశాంత్‌కుమార్ పాటిల్, గుడిబండ జిల్లా కన్నడ సంస్కృతిశాఖ సహాయ కార్యదర్శి మనీషా, స్థానిక గ్రామ సర్పంచ్ కౌసర్, ఉప సర్పంచ్ రాము, గ్రామ ప్రముఖులు చలం పాల్గొన్నారు. జిల్లా కేంద్రమైన చిక్కబళ్ళాపురనుంచి కళాకారుల బృందంచే నృత్య కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. ఇదే సందర్భంగా చేళూరు నుంచి చిక్కబళ్ళాపురకు రాకపోకలు సాగించే బస్సు సర్వీసులను ఎమ్మెల్యే సుబ్బారెడ్డి ప్రారంభించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

వార్డెన్‌గా నెలరోజులే ఉద్యోగం... అంతలోనే జైలుకు

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర జిల్లా సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్ వార్డెన్‌గా ఉద్యోగంలో చేరిన నెలరోజులకే బసవరాజ్ యాళవార అరెస్టు అయ్యాడు. జనవరి 19న బసవరాజ్ వార్డెన్‌గా విధులలోకి చేరారు. ఈనెల 21న సీఐడీ బృందాలు అరెస్టు చేశాయి. కర్ణాటక ఎగ్జామినేషన్ అథారిటీ (కేఈఏ) నిర్వహించిన ఎఫ్‌డీఏ పరీక్షల్లో ప్రశ్నాపత్రం లీక్‌కు సంబంధించి మరొకరు అరెస్టు అయ్యారు. ఇంగ్లీష్‌లో ఎంఏ, బీఈడీ చదివిన బసవరాజ్ గతంలో అశోక్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కోకా చట్టం కింద కేసు నమోదైన వెంటనే పరారీలో ఉన్నాడు. సీఐడీ పోలీసులు గాలింపులు చేపట్టి ఎట్టకేలకు అరెస్టు చేశారు. కేఈఏ పరీక్షల అక్రమాలను సీఐడీ బృందం వేగవంతంగా దర్యాప్తు జరుపుతోంది. అఫ్జల్‌పుర తాలూకా పీయూ కళాశాల ప్రిన్సిపాల్స్ ఇరువురికి రూ.40లక్షలు లంచం ఇచ్చిన విషయం వెలుగులోకి వచ్చింది. బసవరాజ్ యాళవార విచారణ వేళ మరిన్ని వాస్తవాలు చెప్పినట్టు తెలుస్తోంది. ప్రిన్సిపాల్ చంద్రకాంత్, బసవణ్ణ పూజారిలనుంచి సాయం పొందినట్టు బసవరాజ్ వెల్లడించిన మేరకు సీఐడీ బృందాలు ప్రిన్సిపాళ్లపై చర్యలకు సిద్ధమయ్యారు.

సాసలు హోబళిని పట్టించుకోండి

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యపై నిరసన
- పంటలను కాపాడాలని డిమాండ్

దొడ్డబళ్ళాపుర, ఫిబ్రవరి 24: తాలూకాలో సరిహద్దున ఉండే వెనుకబడిన ప్రదేశమైన సాసలు హోబళి పట్ల ప్రజా ప్రతినిధులు, పాలకవర్గం నిర్లక్ష్యం చూపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాలూకాలోని ఇతర హోబళిలతో పోలిస్తే సాసలును పట్టించుకోవడం లేదు. హోబళిలో దశాబ్దాలుగా విద్య, ఆరోగ్యం, పేదరిక సమస్యలు ఉన్నాయి. ఎన్నికల ప్రచారం వేళమాత్రమే కనబడే నాయకులు ఆ తర్వాత కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు కూడా సాసలు హోబళి అభివృద్ధి పట్ల తగిన శ్రద్ధం చూపకపోవడం యక్షప్రశ్నగా మారింది. హోబళిలోని శ్రీరామహనహళ్ళిలో రైతులు వక్క, అరటి, కొబ్బరి ఇతర వాణిజ్యపంటలకోసం బోరుబావులకు విద్యుత్ కనెక్షన్ పొందారు. 18 బోరుబావులకు సంబంధించి ఒకటే ట్రాన్స్‌ఫార్మర్ కావడంతో తరచూ ఓల్టేజ్ ఇతరత్రా సమస్యలు ఏర్పడుతున్నాయి. అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లకోసం పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులను కోరినా, విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌నుంచి కనెక్షన్ పొందే విషయమై గ్రామస్థుల మధ్య తరచూ గొడవలు జరిగాయి. గ్రామస్థులు సమస్యను పోలీస్ స్టేషన్ దాకా తీసుకెళ్లినా బెస్కాం అధికారులు మాత్రం ఏదో ఒకటి నెపం చెప్పి తప్పించుకుంటున్నారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు 4-5ఏళ్లక్రితం వ్యక్తిగత ట్రాన్స్‌ఫార్మర్ కోసం అర్జీ సమర్పించి డిపాజిట్ కట్టారు, రైతులు అప్పులు చేసి నష్టాలు అనుభవిస్తున్నా బెస్కాం నుంచి మాత్రం కనీసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో తగిన చొరవ చూపడం లేదు.

ఈ నేపథ్యంలో గ్రామస్థులు శనివారం నిరసన తెలిపారు. లైన్ మెన్ ఒకరు టీసీ, విద్యుత్‌స్తంభం ఏర్పాటుకు రూ.50వేలు పొందినా ఇంత వరకు అమర్చలేదని 85ఏళ్ల వృద్ధుడు అశ్వత్థప్ప వాపోయారు. రైతుల సమస్యల గురించి బెస్కాం అధికారులను ప్రశ్నిస్తే బడ్జెట్ రాలేదని, మార్చిలో 63 కేవీ సామర్థ్యంతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్ అమరుస్తా మన్నారు.



గ్రామస్థుల నిరసన

సాసలు, తూబగెరె హోబళిలో 250మంది వ్యక్తి గత టీసీలు అమర్చేందుకు అనుమతులు వచ్చాయని త్వరలోనే కార్యాచరణ చేప డతామని బెస్కాం గ్రామీణ ఉప విభాగం ఏఈఈ ఇనాయత్ తెలిపారు. కాగా ఇదే సమస్యపై నెలమంగల బెస్కాం కార్యనిర్వాహక ఇంజనీర్‌ను ప్రశ్నిస్తే దొడ్డబళ్ళాపుర ఉపవిభాగం అధికారులకు చెప్పండి వారు మాకు వివరిస్తారంటూ నిర్లక్ష్యంగా బదులిస్తున్నారు.

30 ఎకరాలలో పంట నాశనం

శ్రీరామనహళ్ళి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ సమస్య కారణంగా సుమారు 30 ఎకరాలకుపైగా పంటలు దెబ్బతిన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోనే వక్క మొక్కలు ఉన్నాయి. నీరు లేక ఎండిపోతున్నాయి. రాగి పైరు, అరటి మొక్కలు కూడా ఎండిపోతున్నాయి. గత ఏడాది సరైన వర్షాలు లేక పంటలు దెబ్బ తిన్నాయి. ఈ సంవత్సరం అప్పుడే ఎండలు అధికం కాగా విద్యుత్ సమస్య, ట్రాన్స్‌ఫార్మర్ తదితర సమస్యలతో పంటలు దెబ్బతింటున్నాయన్నారు. ఒకవేళ జనరేటర్‌తో నీరు సమకూర్చాలన్నా వేలాది రూపాయల ఖర్చు అవుతోందని ఇలాగైతే జీవనం ఎలాగని గ్రామస్థులు నరసింహమూర్తి, మంజునాథ్, మహిళా రైతు సంధ్యా ప్రశ్నించారు. బెస్కాం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అరుణ్‌కు అభినవ అమరశిల్పి పురస్కారం



మీడియాతో డాక్టర్ విశ్వనాథ్ హిరేమఠ్ తదితరులు

- హిరేమఠ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్చి 4న కారవారలో ప్రదానం

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ హిరేమఠ్ ఫౌండేషన్ అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ రూపకర్త అరుణ్ యోగిరాజ్‌కు అభినవ అమరశిల్పి పురస్కారాన్ని అందించనున్నట్టు డాక్టర్ విశ్వనాథ్ హిరేమఠ్ ప్రకటించారు. శనివారం బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. మార్చి 4న కారవారలోని సాగర్ కన్వెన్షన్ హాల్‌లో పురస్కారంతో సత్కరిస్తామన్నారు. అయోధ్యలో రామమందిరం ఐదు శతాబ్దాల కోట్లాదిమంది కలల ఎదురుచూపు అన్నారు. అటువంటి ఆలయంలో సర్వాంగ సుందరంగా రామ్‌లల్లా విగ్రహాన్ని రూపొందించిన శిల్పి మైసూరు వాసి కావడం సంతోషమన్నారు. శ్రీరామసేన సంస్థాపకుడు ప్రమోద్ ముతాలిక్ ముఖ్యులుగా పాల్గొంటారన్నారు. కాగా ఉత్తరకన్నడ జిల్లాలో దశాబ్దాలకాలంగా లాభాపేక్ష లేకుండా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమాజ సేవ చేస్తున్నామన్నారు. యువతకు నైపుణ్యం, మహిళా స్వావలంబన, ఆరోగ్యం, స్వచ్ఛ ఉత్తరకన్నడ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యదర్శి లక్ష్మీశా, ప్రధాన కార్యదర్శి చేతన్‌లు ఉన్నారు.

పౌష్టికాహారంతో చక్కటి ఆరోగ్యం

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 24: చక్కటి దేహదారుఢ్యానికి, మానసిక ఆరోగ్యానికి సమతుల్యమైన పౌష్టికాహారం అవసరమని తాలూకా పంచాయతీ కార్య నిర్వహణాధికారి జీ మునిరాజు అభిప్రాయపడ్డారు. బాల్యం నుంచే చక్కటి ఆహారం తీసుకోవడం ద్వారా శారీరక ఎదుగుదల సక్రమంగా ఉంటుందని, తద్వారా పౌష్టిక లోపాన్ని అధిగమించాలన్నారు. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యా శాఖ, ముద్దేనహళ్ళి సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు, కేఎంఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్షీరభాగ్య పథకం కింద పాలతో కూడిన సాయి ష్యూర్ రాగిమిక్స్ పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. రాగి వంటి తృణధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా చక్కటి ఆరోగ్యం సాధ్యమన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచడంతోపాటు పౌష్టికలోపాన్ని దూరం చేసేలా క్షీరభాగ్య, మధ్యాహ్న భోజనం వంటివి అమలు చేస్తోందన్నారు. కాగా మొబైల్ వాడకానికి బానిస కారాదని, సాంకేతిక ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. పుస్తకాలను చదివే అలవాటు పెంచుకోవాలన్నారు. బీఈఓ, సీఏ నరేంద్రకుమార్ మాట్లాడుతూ నిరంతర అభ్యాసం ద్వారా పాఠాలను త్వరగా అర్థం చేసుకోవచ్చునన్నారు. అలాగే ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో పథకాలు



రాగిహెల్త్‌మిక్స్ పాల పంపిణీలో అధికారులు, ఉపాధ్యాయులు

అమలు చేస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాలూకా అక్షరదాసోహ మధ్యాహ్న భోజన పథకం సహాయక డైరెక్టర్ ఆంజనేయ మాట్లాడుతూ కొన్నేళ్లుగా సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు సహకారంతో సాయిష్యూర్ ప్రోటీన్ మిక్స్‌ను పాలతో కలిపి ఇచ్చేవారమని ప్రస్తుతం రాగి హెల్త్‌మిక్స్ ద్వారా మరింత ఆరోగ్యం సాధ్యమన్నారు. తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఎస్ సుబ్బారెడ్డి, తాలూకా హైస్కూల్ స్కూల్‌అసిస్టెంట్‌ల సంఘం అధ్యక్షుడు ఎల్‌వీ వెంకటరెడ్డి, కార్యదర్శి రుద్రేశమూర్తి, బీఆర్‌సీ సమన్వయాధికారి త్యాగరాజు, బీఆర్‌పీ కే మంజునాథ్, లక్ష్మీనారాయణ్, ప్రధానోపాధ్యాయురాలు ఇషత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కైవారలో ఘనంగా రథోత్సవం



కైవార రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చింతామణి, ఫిబ్రవరి 24: తాలూకాలోని కైవార సద్గురు యోగి నారేయణ మఠంలో మాఘమాసం పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం విశేష కైంకర్యాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత అమర నారేయణస్వామి, సద్గురు తాతయ్య ఉత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. స్వామివారికి విశేష అభిషేకం, అష్టావధాన సేవ, మహామంగళారతి అనంతరం రథోత్సవం నిర్వహించారు. యోగినారేయణ సంకీర్తనా ప్రాజెక్టు సంచాలకులు వానరాశి బాలకృష్ణ భాగవతార్ నేతృత్వంలో ప్రవచనం జరిగింది. నాదసుధారాస కళాకారుల బృందంచే సంకీర్తన సమర్పించారు. కాగా తాలూకాలోని ఆలంబగిరి దేవాలయం నుంచి సుమారు ఒక కిలోమీటరు మేర ప్రకృతి రమణీయత నడుమ పౌర్ణమిని పురస్కరించుకుని సంకీర్తనా గిరి ప్రదక్షిణ కార్యక్రమం సాగింది. కైవార ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరామ్ సహా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోనకుంట్లులో గిరి ప్రదక్షిణ

తాలూకాలోని ముంగానహళ్ళి హోబళిలోని పుణ్యక్షేత్రం కోనకుంట్లు దేవాలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శుక్ర, శనివారాలలో రెండు రోజుల పాటు గిరి ప్రదక్షిణ నిర్వహించారు. సాయంత్రం వందలాది భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణస్వామి పూజ, దీపారాధన నిర్వహించిన అనంతరం గిరిప్రదక్షిణ చేపట్టారు. వెంకటరమణస్వామి ఆలయం నుంచి ప్రారంభమై రామకోటి, సిద్దరగవి, ఉల్లూరమ్మ దేవస్థానం, సోమకలహళ్ళి వీరాంజనేయస్వామి దేవస్థానం, హనుమయ్యగారహళ్ళి సీతారామస్వామి దేవాలయం మీదుగా కోనకుంట్లు దేవాలయానికి చేరుకున్నారు. తదుపరి విశేషపూజలు, ప్రసాద వినియోగం నిర్వహించారు. గిరిప్రదక్షిణలో పెద్దసంఖ్యలో పురుషులు మహిళలు పాల్గొన్నారు.

పటిష్టమైన భద్రత కల్పించండి

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అధికారులకు ఈసీ ఆదేశం

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని మూడు రాష్ట్రాల ఎన్నికల అధికారులు, పోలీసు ఉన్నతాధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్‌కుమార్ ఆదేశాలిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించేందుకు రాజీవ్‌కుమార్‌తో పాటు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ధర్మేంద్రశర్మ, నితీష్ వ్యాస్, డిప్యూటీ కమిషనర్లు అజయ్‌బాదు, మనోజ్‌కుమార్ సాహూల్, ప్రిన్సిపల్ సెక్రటర్ మల్లిక్ చెన్నైరు. శుక్రవారం ఉదయం రాష్ట్రంలోని డీఎంకే, అన్నాడీఎంకే సహా ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన వీరు ఎన్నికల ఏర్పాట్లపై చర్చలు జరిపారు. ఆ సందర్భంగా ప్రధాన పార్టీల ప్రతినిధులంతా లోక్‌సభ ఎన్నికలను ఒకే విడతగా జరపాలని ఎన్నికల సంఘం ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలలో ఏ అభ్యర్థికి ఓటు వేశారో తెలిపే వీవీ పాట్‌ను ఉపయోగించకూడదంటూ డీఎంకే డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు సమావేశమై తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల ప్రాంతీయ ఎన్నికల అధికారులతో చర్చలు జరిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, డీజీపీ శంకర్ జివాల్, రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రద సాహూ తదితరులు హాజరయ్యారు. మూడు రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలకు చేపడుతున్న చర్యల కోసం ఆయా రాష్ట్రాల ప్రాంతీయ ఎన్నికల అధికారులు వివరించారు. ఆ తర్వాత రెవెన్యూ, ఆదాయపు పన్ను శాఖల అధికారులు, కేంద్ర రిజర్వు పోలీసు దళం ఉన్నతాధికారులు తదితరులు సమావేశానికి హాజరై తమ ఏర్పాట్లను కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు తెలిపారు. చివరగా మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల వరకు రాష్ట్ర డీజీపీ శంకర్‌జివాల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనాతో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష జరిపారు.

ప్రియుడి ఎదుటే దౌర్జన్యం

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ప్రియుడి ఎదుటే లైంగిక దౌర్జన్యానికి పాల్పడిన సంఘటనలో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. కోరమంగలలో ప్రేమికులు కలసి ఉండడాన్ని గమనించిన నలుగురు అసభ్యంగా ప్రవర్తించారు. యువకుడిపై దాడి చేసి అక్కడనుంచి పంపేశారు. యువతి శరీరాన్ని తాకుతూ అనుచితంగా ప్రవర్తించారు. వారి నుంచి తప్పించుకుని నేరుగా ఆడుగూడి పోలీసులకు బాధిత యువతి ఫిర్యాదు చేసింది. ఈమేరకు నలుగురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టారు.

హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం : ఎమ్మెల్యే



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, ఫిబ్రవరి 24: గత శాసనసభ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కులమతాలు పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ చేరేలా ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి మండలి అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి పేర్కొన్నారు. తాలూకాలోని బూదికోటె హోబళి సంత మైదానం సమీపాన తాలూకా యంత్రాంగం శనివారం ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీ పథకాల అమలుకు సంబంధించిన సమా వేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేసిన ఏకైక ప్రభుత్వం సిద్దరామయ్య సర్కార్ అన్నారు. పేద, రైతు, కార్మిక, మహిళలు, యువజనుల స్వావలంబనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడిందన్నారు. అన్నభాగ్య, గృహలక్ష్మి, యువనిధి, గృహజ్యోతి శక్తి యోజన పథకాలను అమలు చేస్తోందన్నారు. కరువు నేపథ్యంలో రైతుల రుణాలపై వడ్డీని మాఫీ చేసిందన్నారు. పాడిరైతులకు ప్రతి లీటరు పాలకు రూ.5 సబ్సిడీ, పశువులకు మేత కిట్ ఇస్తున్నట్టు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. సమావేశంలో పోలీసు అధికారి సునిల్‌కుమార్, గ్రామపంచాయతీ అధ్యక్షుడు మంజునాథ్, రామశెట్టి, పిచ్చహళ్ళి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై జాగృతి



జాగృతిలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది తదితరులు

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 24: పాత ఎయిర్‌పోర్ట్ రోడ్డులోని కార్ల్‌టన్ టవర్‌లో గతంలో జరిగిన అగ్ని ప్రమాదం నేపథ్యంలో రాష్ట్ర అగ్నిమాపక సిబ్బంది అత్యవసర సేవల విభాగం ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక జాగృతి నిర్వహించారు. సర్జాపుర రోడ్డులోని అగ్నిమాపక విభాగం నేతృత్వంలో నారాయణ హృదయాలయ ఆసుపత్రి, హెచ్ఎస్ఆర్ లే అవుట్ ఆసుపత్రి సిబ్బంది అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి, అనుకోకుండా ప్రమాదాలు జరిగితే ఎలా స్పందించాలనే అంశంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఫైర్‌స్టేషన్ అధికారి సంపత్‌రాజు, అనురాగ్, మునిరాజు, రామణ్ణ, నాగరాజ, నింబక్కనవర, విఠ్ఠల కారెప్పతోపాటు ఆసుపత్రి హెచ్ఆర్ జరినా, సేఫ్టీ ఆఫీసర్ మోసిన్, మంజునాథ్, మేనేజర్ ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగమేళాలో 500 మంది దివ్యాంగులకు అవకాశం



మేళాలో పాల్గొన్న దివ్యాంగులు తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జయనగర్‌లోని సిటీ కాలేజ్ ఆధ్వర్యంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దివ్యాంగుల మేళాలో పెద్దసంఖ్యలో నిరుద్యోగులు పాల్గొన్నారు. 50కుపైగా కంపెనీలు పాల్గొనగా 500మందికిపైగా దివ్యాంగులకు ఆఫర్ లెటర్ పొందారని సిటీ కాలేజ్ ప్రిన్సిపాల్ పుట్టరాజు తెలిపారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ, పీజీ చదివిన వారు పాల్గొన్నారని దివ్యాంగులనే కారణంతో వారిని చిన్నచూపు చూడరాదన్నారు. దివ్యాంగులలో ఆత్మవిశ్వాసం పెంపొందేలా మేళా నిర్వహించినట్టు తెలిపారు. రాష్ట్ర దివ్యాంగులశాఖ సంయోజకులు నరసింహమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో 13లక్షల మంది దివ్యాంగులు ఉండగా వీరిలో 2.5లక్షలమంది నిరుద్యోగులు ఉన్నారన్నారన్నారు. అత్యధికశాతం గ్రామీణ ప్రాంతాలవారేనన్నారు. నైపుణ్యం లేకపోవడమే నిరుద్యోగానికి కారణమని గుర్తించి డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ వారికి తర్ఫీదు ఇస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందన్నారు. సిటి కాలేజ్ అధ్యక్షులు డాక్టర్ కేఆర్ పరమహంస, ఉపాధ్యక్షురాలు మోనికా కల్లూరి మేళాను ప్రారంభించగా డీన్ టిట్టు ఆంటోని ఆడమ్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ టెరిటెరి హెడ్ భావని తదితరులు పాల్గొన్నారు. అసెంచర్, మణిపాల్ సిగ్మా, పేటీఎం, అమెజాన్, మిట్టి కెఫె తదితర సంస్థలు మేళాలో భాగస్వామ్యులయ్యాయి.

గ్రామీణ క్రీడాకారులకు నిరంతర సాయం



క్రీడా కిట్లు అందజేస్తున్న యువ పారిశ్రామికవేత్త ఆర్యమన్

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు నిరంతరం సాయం అందిస్తామని ప్రముఖ వ్యాపారి సునితా తిమ్మేగౌడ, అశోక్ శంకర్‌ల వారసులు యువ పారిశ్రామికవేత్త ఆర్యమన్ ప్రకటించారు. కొళ్ళేగాలలోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ స్కూల్ ఫర్ స్పీచ్ అండ్ హియరింగ్ విద్యార్థులకు అవసరమైన పరికరాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆర్యమన్ మాట్లాడుతూ 11వ యేటనే సింగపూర్ వెళ్లానని, అక్కడ చదువుతోపాటు వ్యాపారంలో కొనసాగానని ప్రస్తుతం వెయ్యికోట్ల టర్నోవర్‌తో కంపెనీ నడుపుతున్నా అన్నారు. అయితే మా పూర్వీకులు, తల్లిదండ్రుల తరహాలోనే సమాజానికి సేవ చేయాలనే గ్రామీణ ప్రాంతాలలో అవసరమైనవారికి సౌలభ్యాలు కల్పించదలిచానన్నారు. ఆర్యమన్ వెంట జపాన్‌కు చెందిన వ్యాపార భాగస్వామ్యులు, మిత్రులు పాల్గొన్నారు.

సంస్కృతిని భావితరాలకు అందించాలి



వివిధ రంగాల సాధకులకు సన్మానం

విజయపుర, ఫిబ్రవరి 24: మన సంస్కృతి సంప్రదాయాలను భావితాలకు అందించేలా స్వచ్ఛంద సంస్థలు మరింత చొరవ చూపాలని బెంగళూరు గ్రామీణ జిల్లా గొర్రె ఉన్ని ఉత్పత్తిదారుల సహకార సంఘం మాజీ అధ్యక్షుడు, సమాజ సేవకుడు టీకే నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. స్థానిక హైస్కూల్‌లో అఖిల కర్ణాటక మిత్ర సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటైన 68వ కన్నడ రాజ్యోత్సవం, కర్ణాటక నామకరణ సువర్ణ మహోత్సవం 2023-24, సమాచార విజ్ఞానం, కంట్రాక్టుదారులు, సమాజసేకుల ఉత్సవానికి అధ్యక్షుడిగా అభినందన స్వీకరించి మాట్లాడారు. కన్నడ మనుగడకు పోరాటం చేయడమే కాకుండా మనస్సులను ఏకం చేసేలా సంఘ సంస్థలు కృషి చేయాలన్నారు. ఇటీవల కరవే నారాయణగౌడ నేతృత్వంలో పోరాటం ఫలితంగా నామఫలకాలలో 60శాతం కన్నడ తప్పనిసరికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. అఖిల కర్ణాటక మిత్రసంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిమా సుధాకర్ మాట్లాడుతూ వివిధ రంగాలలో రాణిస్తున్న సాధకులను గుర్తించి సత్కరించడం ద్వారా తగిన గుర్తింపు లభించేలా చేస్తున్నట్టు తెలిపారు. శిడ్లఘట్ట తాలూకా కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ తండ్రి వరదరాజు, పీఆర్ చందన్, క్యాతెగౌడ తదితరులు పాల్గొన్నారు. ఆయా రంగాలలో రాణించిన సాధకులకు జ్ఞాపికలు అందచేసి ఆత్మీయంగా సత్కరించారు.

మల్టీ ఒమిక్స్‌ల్యాబ్‌తో ఉత్తమ వైద్య విధానం



ల్యాబ్ ప్రారంభంలో ప్రముఖులు

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కండరాల విచ్ఛిన్నం రక్తపోటు నిర్వహణకు అత్యాధునిక సాంకేతిక విధానం మల్టీ ఒమిక్స్ ల్యాబ్ ద్వారా ఉత్తమ వైద్య విధానం అందుబాటులోకి రానుందని స్వదేశీ జీపీటీ హనుమాన్ వ్యవస్థాపకులు డాక్టర్ విష్ణువర్ధన్ అభిప్రాయపడ్డారు. శనివారం నగరంలో ల్యాబ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అమెరికాలోని ఇలినాయిస్ యూనివర్సిటీ పరిశోధనా కేంద్రం ద్వారా ఆవిష్కరించబడినట్టు తెలిపారు. మెటబాలిక్ డిజార్డర్‌ల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానం అనుబంధంగా ఉందన్నారు. డయాబెటిక్, ఒబెసిటీ, రక్తపోటు, కండరాల విచ్ఛిన్నం వంటి సమస్యలకు పరిష్కారం లభించనుందన్నారు. ఇలి నాయిస్ యూనివర్సిటీ ప్రతినిధి తిమోతి లారెన్స్ కిలిన్ మాట్లాడుతూ ఆరోగ్య పరమైన అంశాలలో సుదీర్ఘంగా పరిశోధనలు చేస్తున్నామన్నారు. ప్రొఫెసర్ నరేంద్ర అహుజాతోపాటు పలువురు పాల్గొన్నారు.